# శివార్లలో ఘోర ప్రమాదం

**రోడ్డుపై పార్కు చేసిన టిప్పర్‌ను ఢీకొట్టిన చికెన్ లోడ్ డిసిఎం**

**సంఘటనా స్థలంలోనే ఇద్దరు లేబర్ల దుర్మరణం**





మృతుడు, ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన డిసిఎం

సరూర్‌నగర్, మే 24 ప్రభాతవార్త: అర్ధరాత్రి సమయంలో రోడ్డుపై నిలిపి ఉన్న టిప్పర్‌ను చికెన్ లోడ్‌తో వస్తున్న డిసిఎం ఢీకొనడంతో ఇద్దరు లేబర్లు తీవ్ర గాయాలకు గురై సంఘటనా స్థలంలోనే దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటన నగర శివార్లలోని పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుక్కుగూడలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కల్వకుర్తి నుండి చికెన్ లోడ్‌తో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత హైదరాబాద్ వైపు వస్తున్న డిసిఎం (నెంబర్ టిఎస్08యుఇ 6606) తుక్కుగూడ వద్దకు రాగానే రోడ్డుపై పార్కు చేసి ఉన్న టిప్పర్ (నెంబర్ టిఎస్ 12 యుడి 3999)ను ఢీకొట్టింది. దీంతో డిసిఎంలో డ్రైవర్ పక్క న కూర్చున్న మల్కాజిగిరి ప్రశాంతినగర్‌కు చెందిన బీహార్ లేబర్లు రోషన్ కుమార్ (21), సీఫ్‌కుమార్ (22)లు తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో అయితే సురక్షితంగా బయటపడ్డ డ్రైవర్ మహ్మద్ రహ్మత్ పహాడీషరీఫ్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



# పదిలోనే పబ్‌వైపు..



- ➢ **విద్యార్థి దశలోనే మద్యానికి బానిస**
- ➢ **పబ్‌లకు వెళ్లేవారిలో మైనర్లే అధికం**
- ➢ **తల్లిదండ్రులు మేల్కొనాలి**



హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త: మద్యం మత్తులో బాల్యం చితికిపోతుంది.. కేవలం యువకులు, ఆపైబడిన వయసున్న వారే మద్యానికి బానిసలయ్యారనే పరిస్థితులు నేడు మారిపోయాయి. మందు తాగడం ఓ హాబీగా తయారైంది. ఇద్దరుకలిస్తే సిగరేట్.. నలుగురు కలిస్తే మందు అన్నట్లు ఉంది ప్రస్తుత పరిస్థితి. అయితే ఈవ్యసనమనే జాడ్యం పాఠశాల విద్యార్థులకు కూడా అంటుకోవడమే ప్రస్తుతం నగరాన్ని వణికింపజేస్తున్న పరిణామం. విదేశీ అలవాట్లును ఒకరిని చూసి మరోకరు నేర్చుకుంటున్నారు. పాశ్చాత్త దేశాల సంప్రదాయాలు చాలా వరకు మనదేశ యువతను పెడదారి పట్టిస్తున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

**విద్యార్థిదశలోనే పబ్‌ల వెంట..** చక్కగా చదువుకోవాల్సిన వయస్సులో కాక్‌టెయిల్ రుచి చూస్తూ పబ్‌ల వెంట తిరుగుతున్నారు మైనర్లు. ఈసంస్కృతి నగరాల్లో విపరీతంగా పెరిగిపోయింది. తల్లిదండ్రులు తమ పనుల్లో బిజీగా ఉండటం, పిల్లలు అడిగినంతా పాకెట్‌మనీ ఇవ్వడం, వారు ఎప్పుడు ఇంటికి వస్తున్నారో.. ఎక్కడికి వెళ్తున్నారో తెలుసుకునే పరిస్థితుల్లో తల్లిదండ్రులు లేకపోడంతో ఈపరిస్థితి నెలకొంటుంది. మంగళవారం నగరంలో ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపినప్పుడు ఓపబ్‌లో సగానికిపైగా మైనర్లు అక్కడి నుండి పారిపోయారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా ముంబై, బెంగళూర్, హైదరాబాద్ సిటీల్లో బాలుడి చేతిలో బీరుబాటిళ్ళు కామన్ అయిపోతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. బీరు బాటిళ్ళు పట్టుకునే టీనేజర్ల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇక న్యూఇయర్, బర్త్‌డే పార్టీలు వస్తే చాలు ఆరోజు డబుల్ ధమాఖానే అంటున్నారు టీనేజర్లు. మరింత ఆందోళన కలిగించే ఆంశం ఏమిటంటే.. అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా మద్యం సేవించడం.

ప్రపంచ ఆరోగ్య సంస్థ( డబ్ల్యు హెచ్‌ఒ) లెక్కల ప్రకారం దేశంలో 15ఏళ్ల వయస్సు70శాతం మంది బాలబాలికలు ఇప్పటికే లిక్కర్ టేస్ట్ చూశారని చెబుతుంది. గడిచిన 20సంవత్సరాల్లో ఇండియాలో మద్యం వినియోగం 55శాతం పెరిగిందని తెలిపింది. లిక్కర్ టేస్ట్ చూసే వయస్సు కూడా తగ్గిందని పారిస్‌కు చెందిన ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ నివేదిక స్పష్టం చేస్తోంది. హైదరాబాద్‌తో పాటు బెంగళూర్, చెన్నై, ముంబై, గోవా, ఛండీఘర్, ఢిల్లీలో 14ఏళ్ల దాటిన చిన్నారులు ఆల్కహాల్ రుచి చూస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఎక్కువగా బాలురు ఉన్నారని తెలిపారు. ఈపిల్లలు ఎప్పుడెప్పుడు మందు కొట్టేది కూడా తెలియజేశారు. చిరాగ్గా ఉన్నప్పుడు, అప్‌సెట్ అయినప్పుడు మందు కొడతారని 52శాతం టీనేషర్లు ఓపెన్‌గానే చెప్పేస్తున్నట్లు నివేదికలో వెల్లడించారు. 2శాతం మందయితే ఏపనిలేక బోర్ కొట్టినప్పుడు తాగు తున్నట్లు నివేదికలో వెల్లడైంది. అన్నింటి కంటే డేంజర్ విషయం ఏంటంటే కేవలం కిక్‌కోసమే 47శాతం టీనేజర్లు మందు కొడుతున్నట్లు సమాచారం. డబ్బులు ఎలా అని అడిగితే పాకెట్‌మనీ అని చెబుతున్నారు. ఒక న్యూఇయర్, బర్త్‌డే పార్టీకే ఒక్కో టీనేజర్ రూ. 2వేల నుండి 10వేల రూపాయల ఖర్చు చేస్తున్నట్లు సర్వేలో స్పష్టం అయ్యింది. చిన్న వయస్సులో మద్యం తాగటం వల్ల మెదడు పనితీరు, అభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడుతుందని డాక్టర్లు చెబుతున్నారు.

**తల్లిదండ్రుల నిర్లక్ష్యమే పిల్లలకు శాపం..** మద్యానికి బానిసయ్యే బానిసయ్యే వారిలో ఇంటికి దూరంగా.. ఒంటరిగా ఉంటూ దూర ప్రాంతాల్లో చదువుకునే వారు కొందరైతే.. తల్లిదండ్రల వద్ద ఉండి కూడా పెడదారి పడుతున్నవారు మరి కొందరు.. పాశ్చాత్య దేశాల్లో చదువుకొని భిన్న సంస్కృతుల్లో పెరుగుతుండటంతో యువతుల్లో సైతం మద్యపానం, ధూమపానం పట్ల గతంలో ఉన్న కట్టుబాట్లు సడలుతున్నాయి. విదేశాలు ఇతర రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది యువతీ, యువకులు తెలుగురాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. లక్షలాది మంది తెలుగు యువతీ యువకులు మద్రాస్, బెంగళూర్, ముంబాయి, పూణే వంటి నగరాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంటికి దూరంగా ఉంటూ హాస్టళ్లలో ఉంటున్నారు. అమ్మానాన్నలకు, ఇరుగుపొరుగు వారికి ఎవరికీ తెలుస్తుందేమోనన్న భయం లేకపోవడంతో వాటికి ఆకర్షితులైన కొంత మంది అమ్మాయిలుకూడా వాటిని రుచి చూస్తున్నారు. మరికొందరు వీకెండ్ పార్టీలకు వెళ్లినప్పుడు స్నేహితుల ఒత్తిడి మేరకు మద్యానికి అలవాటు పడుతున్నారు. తల్లిదండ్రులకు దూరంగా ఉండటం దిగులు, పనివత్తిడి నుండి ఉపశమనం పొందటానికే మద్యపానానికి అలవాటు పడుతున్నట్లు మానసిక వైద్య నిపుణులు తెలుపుతున్నారు.

# స్కిజో ఫ్రినియాకు ప్రాథమిక దశలోనే చికిత్స అందించాలి

**గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు**



కార్యక్రమంలో మాట్లాడుతున్న గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు

సికింద్రాబాద్, మే 24 ప్రభాతవార్త : స్కిజోఫ్రినియా దీర్ఘకాలిక మానసిక వ్యాధితో బాధపడేవారికి సరైన చికిత్స అందించగలిగితే వ్యాధిని పూర్తి నయం చేయవచ్చునని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు అన్నారు. ప్రపంచ స్కిజోఫ్రినియా దినోత్సవాన్ని పురస్కరించుకొని గాంధీఆస్పత్రి మానసిక వైద్య విభాగం ఆధ్వర్యంలో స్కిజోఫ్రినియా గురించి అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు, వైద్య విద్యార్థులు ఓపీడీ విభాగంలో రోల్ ప్లే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొన్న సూపరింటెండెంట్ రాజారాజు మాట్లాడుతూ ఈ మానసికి వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించగలితే వ్యాధి ముదరకుండా తగిన మందులు వాడితే పూర్తిగా నయం చేయవచ్చన్నారు. గ్రామీన ప్రాంతాలలో ఈ వ్యాధిని దయ్యం పట్టిందనో, చతబడి చేశానో భావించి బూతవైద్యులను, మంత్రాల పేరుతో చలామణిలో ఉన్నవారిని సంప్రదించి ఎంతో విలువైన సమయాన్ని, సొమ్మును నష్టపోతున్నారని అన్నారు. ఆ వ్యాది లక్షణాలు వందమందిలో ఒకరికి కనిపిస్తుంటాయని ముందుగానే గుర్తించి వైద్యులను సంప్రదించాలని చెప్పారు. స్కిజోఫ్రినియతో బాధపడుతున్న వారు ముందుగా తనలో తాను మాట్లాడుకోవడం, నవ్వుకోవడం, విపరీతమైన అనుమానాలు కలిగి ఉండడం, నిద్రలేమి వంటి లక్షణాలు కలిగి ఉంటారని, ప్రవర్తనలో లోపాలు స్పష్టంటా గుర్తించగలిగే విధంగా ఉంటాయని తెలిపారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదిస్తే వ్యాధులను అదుపుచేయవచ్చని పేర్కొన్నారు.

# త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభం

**డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్**



సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, మే 24 ప్రభాతవార్త: డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ క్యాంపు కార్యాలయాన్ని ఎంఎల్‌ఏ గాదరి కిషోర్ బుదవారం సందర్శించారు. కార్యాలయం కార్యాకలాపాలు, సెట్విన్ సంస్థ పనితీరును ఆయనకు డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ వివరించారు. సికింద్రాబాద్‌లో వివిధ అభివృద్ధి కార్యాకాలాపాలు సాగుతున్న తీరు ఆదర్శవంతంగా నిలుస్తోందని గాదరి కిషోర్ ఈ సందర్భంగా ప్రసంసించారు. కాగా సీతాఫల్‌మండిలో కొత్తగా రూ. 30 కోట్లతో నిర్మిస్తున్న కుట్టి వెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా సమీక్షించారు. విద్యారంగంలో చేయుతకు కృషి చేస్తూ, రాష్ట్రంలోనే మొదటి సారిగా జూనియర్, డిగ్రీ కాలేజీ సీతాఫల్‌మండి ప్రభుత్వ స్కూల్ ప్రాంగణంలో మంజూరు చేయించామని, జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ భవనాల నిర్మాణానికి రూ. 29.75 కోట్ల మేరకు నిదులను ప్రభుత్వం ద్వాఉరా మంజూరు చేయించామని ఆయన తెలిపారు. కొత్త భవనాల నిర్మాణ పనులు సాధ్యమైనంత తొందరలో ప్రారంభించాలని పద్మారావు గౌడ్ అధికా రులకు సూచించారు. ఈ కార్యాక్రమంలో కార్పొరేటర్‌లు సామలహేమ, కంది శైలజ, నేతలు కరాటేరాజు, కంది నారాయణ పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి

**ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి**



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

దుండిగల్, మే 24 ప్రభాతవార్త : మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ట కమిటీ ఆధ్వర్యంలో దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహాదూర్‌పల్లి ఎక్స్‌రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని తెలంగాణ శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వివేకానందలు ముఖ్య అతిథిలుగా హాజరై ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగువారి గుండెలోన్ల చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ఎన్టీఆర్ జీవితం సాగిందన్నారు. సినివినిలాకాశంలో పోషించిన ప్రతి పాత్రకు జీవం పోస్తూ ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసారన్నారు. రాజకీయ చైతన్యం, రాజకీయంలో నాయకులు ఏవిధంగా నడుచుకోవాలో చూపించిన మహానీయుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా సంక్షేమ పథకాలను అమలు చేశారని, పేదవాడి ఆకలి తీర్చేందుకు రూ, 2లకే కిలో బియ్యాన్ని అందించిన గొప్ప ప్రజా సంక్షేమ నాయకుడని తెలిపారు. నటుడిగానే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రజలకు అనేక సేవలందించారన్నారు. ఎన్టీఆర్ నాయకత్వంలో 18 సంవత్సరాలు పార్టీ జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించిన ఏకైక వ్యక్తిని తనేనని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే వివేకానంద్ పుత్ర సమానుడని, అసెంబ్లీలో చక్కటి బాషతో తన వాణిని గట్టిగా వినిపిస్తాడన్నారు. అసెంబ్లీలో బెల్ కొట్టకుండా మాట్లాడే ఏకైక ఎమ్మెల్యే వివేకానంద్ అని పేర్కొన్నారు. బహాదూర్‌పల్లి చౌరస్తాలో చక్కటి స్థలాన్ని కేటాయించి విగ్రహాన్ని ప్రతిష్టించిన కృష్ణారావు, ఆర్గనైజేషన్ వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్ భరత్‌కుమార్, మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, జడ్పీమాజివైస్‌చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ట కమిటి అధ్యక్షులు బొడ్డు రవిశంకర్, మాజీ కౌన్సిలర్ రంగారావు, వీరబాబు, రామక్రిష్ణ, దిలీప్, అజయ్, నరేందర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పౌర సరపరాల శాఖ మంత్రిని కలిసిన రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం



రాష్ట్ర పౌర సరపరాల శాఖ మంత్రి గంగుల కమాలాకర్‌ను కలిసిన రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు

చార్మినార్, మే 24 ప్రభాతవార్త : రాష్ట్రంలోని రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న 22 సమస్యలపై ప్రభుత్వం 20 సమస్యల పరిష్కారానికి అనూకూలం ప్రకటించిన సందర్భంగా బుధవారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు, ఉపాధ్యక్షులు పుస్తె శ్రీ కాంత్, హైదరాబాద్ జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెశిడెంట్ వల్లాల శ్రీధర్, ప్రతినిధి మురళి, ంషన్ డీలర్లు పాల్గొన్నారు.

# అందరికి విద్య, వైద్యం ఉచితంగా అందించాలి

**తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం**




ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కోదండరాం

ధర్నాచౌక్, మే 24, ప్రభాతవార్త: ప్రజలందరికీ సమానమైన విద్య, వైద్యం ఉచితంగా అందించాలని తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఉచిత విద్య వైద్య సాధన సమితి, పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ మన దేశంలో విద్య, వైద్యం కార్పోరేటీకరణ కావటం వల్ల పేదలకు అందటం లేదని అన్నారు. అనేక మంది పేదలు సరియైన వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారని, అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలు నామమాత్రంగా ఉండటమే కాకుండా కనీస సౌకర్యాలు కూడా పాఠశాలలో లేకపోవటం వల్ల పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అందరికీ సమానమైన విద్య, వైద్యం ఉచితంగా అందించటం తమ బాధ్యతగా గుర్తించాలని, అప్పుడే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఉచిత విదన, వైద్య సాధన సమితి అధ్యక్షులు నారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ విద్య, వైద్యం వ్యాపారుల చేతులలో పెట్టటం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యంపై దృష్టి పెట్టటం లేదని, అందుకే బడ్జెట్ కూడా కేవలం నామ మాత్రంగా కేటాయిస్తున్నారని ఆరోపించారు. ఒక ముఖ్యమంత్రి కొడుకు, ఒక సామాన్య రైతు కొడుకు ఇద్దరూ ఒకే స్కూల్‌కు వెళ్లే విధంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, వైద్యం కూడా పేద వారికి, ధనవంతులకు ఒకే విధంగా అందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ అధ్యక్షులు వి.సదానందరెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలను ప్రభుత్వాలే నడపాలని, అప్పుడే అందరికీ సమానమైన విద్య, వైద్యం అందుతాయని అన్నారు. విద్య, వైద్యం అందకపోవటం వల్లనే పేదలు మరింత పేదలు అవుతున్నారని, విద్య, వైద్యం ఉచితంగా అందిస్తే ఇక ఏవీ ప్రజలకు ఉచితంగా అందించాల్సిన అవసరం ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజెఎస్ నగర అధ్యక్షులు ఎం.నర్సయ్య, ఉచిత, విద్య, వైద్య సాధన సమితి నాయకులు, పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో స్ట్రెచర్‌పై బాలిక మృతదేహం

# నిద్రిస్తున్న బాలికపై నుంచి వెళ్లిన కారు

**కారుడ్రైవర్ నిర్లక్ష్యంతో బాలిక మృతి**

హయత్‌నగర్, మే 24 ప్రభాతవార్త: కారు రివర్స్ తీస్తుండగా నిద్రిస్తున్న బాలిక తలమీదుగా వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... కర్ణాటక రాష్ట్రానికి చెందిన రాజు అతని భార్య కవిత కొంత కాలం క్రితం నగరానికి వలసవచ్చి బీఎన్‌రెడ్డినగర్‌లో నివాసముంటూ కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఒక కుమారుడు(7), కూతురు లక్ష్మి(3)ఉన్నారు. రోజువారి పనిలో భాగంగా బుధవారం వారు హయత్‌నగర్ లెక్చరర్స్ కాలనీ బాలాజీ ఆర్కేడ్ పక్కన నూతనంగా నిర్మిస్తున్న భవనానికి స్లాబ్ వేయడానికి వచ్చారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కుమార్తె లక్ష్మి నిద్రపోవడంతో బాలాజీ అర్కేడ్ సెల్లార్‌లో ఉంటున్న వాచ్‌మెన్‌కు చెప్పి బాలికను అక్కడే పడుకోబెట్టారు. కొంత సమయం తరువాత అక్కడ గుర్తు తెలియని కారు రివర్స్ తీస్తుండగా బాలిక తలమీదుగా వెళ్లడంతో తీవ్రంగా గాయపడిన బాలిక అక్కడికక్కడే మృతిచెందింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కారును నిర్లక్ష్యంగా నడిపి తమ కూతురు మరణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలిక తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అభం శుభం తెలియని చిన్నారి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించడం స్థానికులను కలిచివేసింది.

# అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

చాంద్రాయణగుట్ట, మే 24 ప్రభాతవార్త : అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం పాతబస్తీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఉప్పుగూడ మహంకాళి ఆలయం ఆవరణలో 4.96 కోట్ల రూపాయల వ్యయంతో పేద, మధ్య తరగతి ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్మిస్తున్న జీ, ప్లెస్ 3 మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్ రావు, స్థానిక కార్పొరేటర్ సమద్‌బిన్ అబ్దాద్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు జమ్మిచెట్టు రాజు, ఆకుల శ్రీనివాస్, ఆలయం చైర్మన్ మధుసూధన్ గౌడ్‌లతో కలిసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కెసిఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. పాతబస్తీ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. మన సాంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాడమాస బోనాల ఉత్సవాలను ఈ ఏడాది పాతబస్తీలో ఘనంగా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. లాల్‌దర్వాజ శ్రీ సింహవాహిణి మహంకాళి దేవాలయం అభివృద్ధి, విస్తరణకు 10 కోట్ల రూపాయల నిధులు విడుదల చేశారని కావాల్సిన స్థల సేకరణ చేసి పనులు త్వరగా ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు లేకుండా సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులు రాకేష్ తివారి, మదుసూధన్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తిరుపతి శివకుమార్, రాధకృష్ణ, జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్, ఎస్.ఈ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# వృద్ధురాలు అంత్యక్రియల్లో గందరగోళం.. ఉద్రిక్తత

**పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన పరిస్థితి**



రాములమ్మ అలియాస్ నవాజ్‌బేగం(ఫైల్ ఫొటో)

సైదాబాద్, మే 24 ప్రభాతవార్త: మృతి చెందిన ఓ వృద్ధురాలు అంత్య క్రియల విషయంలో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడగా పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది. మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఛాదర్‌ఘాట్ కమల్‌నగర్‌కు చెందిన రాములమ్మ(82) జిహెచ్ఎంసి రిటైర్డ్ ఉద్యోగిని. రాములమ్మకు కూతురు, నలుగురు కుమారులు ఉనా న్నరు. రాములమ్మ కూతురు గండమ్మ ముస్లిం మతం స్వీకరించి సఫీయా బేగంగా పేరు మార్చుకుని మాదన్నపేటలో నివాసముంటుంది. రాములమ్మ తన కుమారులతో పాటు ఛాదర్‌ఘాట్‌లో నివాసముంటుంది. అయితే కొంత కాలం క్రితం మాదన్నపేటలోని కూతురు ఇంటికి వచ్చిన రాములమ్మ ఇస్లాం మతం స్వీకరించి నవాజ్‌బేగంగా పేరు మార్చుకున్నది. కాగా రాములమ్మ అలియాస్ నవాజ్‌బేగం బుధవారం మాదన్నపేటలోని తన కూతురు ఇంట్లో మృతి చెందింది. దీంతో గండమ్మ అలియాస్ సఫీయా బేగం కుటుంబ సభ్యులు రాములమ్మ అలియాస్ నవాజ్‌బేగం మృతదేహాన్ని ముస్లిం మతాచారాల ప్రకారం ఖననం చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఈ లోగా రాములమ్మ చనిపోయిన విషయం తెలుసుకున్న ఆమె మనవళ్లు, మనువరాళ్లు అందరు చివరి చూపు కోసం గండమ్మ ఇంటికి వచ్చారు. రాములమ్మను ముస్లిం మతం ప్రకారం ఎలా ఖననం చేస్తారంటూ గొడవకు దిగారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న టాస్క్ ఫోర్స్ డిసిపి రాధాకృష్ణతో పాటు ఇతర ఉన్నతాధికారులు రెండు వైపుల వారితో మాట్లాడి రాజీ కుదిర్చడం తో పరిస్థితి సద్దుమణిగింది. అనంతరం రాములమ్మ మృతదేహాన్ని ఛాదర్‌ఘాట్‌లోని ఆమె నివాసానికి తరలించారు.

# దంత సమస్యలతో బాధపడుతున్న రోగులకు మెరుగైన వైద్యసేవలు



ఉస్మానియా దంత కళాశాలలోని డిపార్ట్‌మెంట్‌లో దంత వైద్యసేవలు అందిస్తున్న ప్రొఫెసర్ విభాగం అధిపతి డాక్టర్ సర్జీవ్ సింగ్ యాదవ్

అఫ్జల్‌గంజ్, మే 24ప్రభాతవార్త: ఉస్మానియా దంత కళాశాలల్లో దంత సమస్యలతో బాధపడుతున్న రోగులకు మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కన్జర్వేటివ్ డెనిస్ట్రీ, ఎండోడాంటిక్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ సర్జీవ్‌సింగ్ యాదవ్ పర్యవేక్షణలో ప్రతిరోజు సుమారు 300వందలకు పైగా రోగులకు కార్పొరేట్ ఆసుపత్రికి ధీటుగా వైద్యసేవలను అందిస్తున్నారు. ముఖ్యంగా పెరుగుతున్న రోగులకు అనుగుణంగా ఆసుపత్రిలో ప్రత్యేక ంగా గ్రీన్ మ్యాట్ వేసి దంత సమస్యతో వచ్చే రోగులకు వైద్యసేవలను అందించడం జరుగుతుంది. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వైద్యసేవలను అందిస్తున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కన్జర్వేటివ్ డెన్టిస్ట్రీ ఎండోడాంటిక్స్ అధిపతి డాక్టర్ సర్జవ్‌సింగ్ యాదవ్ పర్యవేక్షణలో ఏడుమంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పిజి, దంత వైద్య విద్యార్దులు, ఆసుపత్రి సిబ్బందితో దంత సమస్యతో వచ్చే రోగులకు వివిధ వైద్యపరీక్షలను నిర్వహించి మెరుగైన వైద్యసేవలను అందించడం జరుగుతుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్లు కవిత, పల్లవి, సూర్యకుమారి, అమూల్య, భావన, రమేష్, తులసిలు పిజిలకు సూచనలు, సలహాలు ఇస్తూ దంత సమస్యతో వచ్చే రోగులకు వైద్యసేవలను అందిస్తున్నారు. ఉస్మానియా దంత ఆసుపత్రిలో కార్పొరేట్‌కు దీటుగా పేదరోగులకు ఉచితంగా వైద్యసేవలను అందిస్తున్నారు.

## ఖైరతాబాద్ వినాయకుడి కర్ర పూజ

ఖైరతాబాద్, మే 24 ప్రభాతవార్త: రాష్ట్ర రాజధాని నగరంలోని అతి పెద్ద భారీ వినాయకుడి ప్రతిమ ఏర్పాటుకు త్వరలో కర్ర పూజ జరగనుంది. ఖైరతాబాద్‌లో కొలువుదీరే ప్రతిమ కర్ర పూజ అంగరంగ వైభవంగా జరుగనుంది. వారం రోజుల్లో జరిగే కర్ర పూజ కార్యక్రమానికి వేదపండితులతో పాటు, వివిధ పార్టీల రాజకీయ ప్రముఖులు, అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల వారు, ఉత్సవ కమిటి ప్రతినిధుల బృందం, స్థానికంగా పెద్దలు, ఇలా హాజరయ్యే అవకాశం ఉంది.

## పూర్వ విద్యార్థుల పరీక్షలు రాసుకునేందుకు చివరి అవకాశం

బేగంపేట మే 24,ప్రభాతవార్త : బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యను అభ్యసించిన (2013-2020) పూర్వ విద్యార్థులు తమకు మిగిలిపోయిన పరీక్షలను పూర్తి చేసుకునేందుకు చిట్ట చివరి అవకాశంగా పరీక్షలకు అనుమతిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా.కె.పద్మావతి ఒక ప్రకటనలో తెలియజేసారు. ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ నెల 5వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా జూన్ 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రూ 100 అపరాధ రుసుముతో జూన్ 12వ తేదీ వరకు రూ 500అపరాధ రుసుముతో ఫీజు చెల్లించవచ్చున్నారు. పూర్తి వివరాలకు కళాశాల వెబ్‌సైట్, కళాశాల పరీక్షల విభాగాన్ని సందర్శించి తెలుసుకోవచ్చని తెలియజేసారు.

## ఈనెల 26న తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ దూలపల్లిలో విద్యార్థులకు పోటీ పరీక్షలు

కొంపల్లి,మే24 ప్రభాతవార్త: జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ అకాడమీ ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాలల విద్యార్థులకు డ్రాయింగ్, ఎస్సే రైటింగ్స్‌పై పోటీలను నిర్వహిస్తున్నట్లు బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఈ పోటీలలో 7వ తరగతి విద్యార్థుల వరకు డీఫారెస్టేషన్, కన్సీక్వెన్సెస్‌పై డ్రాయింగ్, 8,9,10వ తరగతి విద్యార్థులకు ప్లాస్టిక్ పొల్యూషన్ అండ్ సొల్యూషన్‌పై ఎస్సే రైటింగ్, కళాశాల విద్యార్థులకు ఛేంజ్ ఆఫ్ లైఫ్ స్టైల్ ఎట్ ఇండస్ట్రియల్ అండ్ కమ్యూనిటీ లెవల్స్ ఫర్ ఎన్విరాన్మెంట్‌పై ఎలోక్యూషన్ విభాగంలో ఈనెల 26న ఉదయం 10:30 గంటలకు నిర్వహి స్తున్నట్లు అకాడమీ తెలిపింది. పూర్తి వివరాల కోసం డిప్యూటీ డైరెక్టర్ ఎస్.ఏ.నాగిని భాను (సెల్: 9491426542), అసి స్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్ (సెల్:9849333055),కో-ఆర్డినేటర్ ధర్మ చంద్ర కుమార్ (సెల్9440278711)లను సంప్రదించగలరు.

## మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి : గజ్జెల నాగేశ్



మారేడ్‌పల్లి సుబ్రమణ్య స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న గజ్జెల నాగేశ్

అడ్డగుట్ట, మే 24 ప్రభాతవార్త: మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలని, స్వామివారిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పోరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ తెలిపారు. బుధవారం మారేడ్‌పల్లిలోని శ్రీ సుబ్రమణ్య స్వామి దేవాలయం నూతన ధర్మకర్తల ప్రమాణ శ్రీ కారోత స్వంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సంతోష్ యాదవ్, ఈఓ సుధాకర్ యాదవ్, బిఆర్ఎస్ నాయకులు ప్రభుగుప్త, కిరణ్,రావుల సతీష్, సనాది శ్రీను, చొల్లేటి రమేష్, నాగేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 50 లక్షల వ్యయంతో నిర్మించిన వెర్టికల్ గార్డెన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు



వెర్టికల్ గార్డెన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, మే 24 ప్రభాతవార్త: నల్లకుంట డివిజన్‌లోని ఫివర్ ఆసుపత్రి సమీపంలో 50 లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించిన వెర్టికల్ గార్డెన్‌ను బుధవారం స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం కెసిఆర్, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్ ప్రజలకు మౌలిక సౌకర్యాల కల్పనతోపాటుగా నగర ప్రాంతాల సుందరీకరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే ఈ వర్టికల్ గార్డెన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతోపాటు అంబర్‌పేట నియోజకవర్గంలో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీవ్యవస్థ, విద్యుత్ లైన్లు వంటి పనులను కూడా దశలవారిగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విజయగణపతి ఆలయం వార్షికోత్సవ వేడుకలు

చిక్కడపల్లి, మే 24 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లోని చిక్కడపల్లి జ్ఞానమందిర్‌లో విజయగణపతి ఆలయం 22వ వార్షికోత్సవ వేడుకలకు స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్, నగర బిజెపి నేత ఎ.వినయకుమార్ పాల్గొన్నారు. దేవాలయంలో స్వామివారిని దర్శించు కుని పూజలు నిర్వహించారు.

## పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి



సికింద్రాబాద్ తహాశీల్దార్ శైలజ ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న షేక్ నయీం తదితరులు

బేగంపేట మే 24, ప్రభాతవార్త : కంటోన్మెంట్ నియోజక వర్గం పరిధిలోని రసూల్‌పురా వార్డు నెంబరు 2లో నివసిస్తున్న పేదలకు ప్రభుత్వ ప రంగా స్థలాలు మంజూరు చేయాలని బోయిన్‌పల్లి ఏఎమ్‌సీ డైరెక్టర్ షేక్ నయీం ఆధ్వర్యంలో కె. య్ ాద్ గిరి, యూసఫ్‌బేగం, షాహిద్ ఆలీ,బాలు, జాకీ, సిరాజ్ తదితరులు సికింద్రాబాద్ తహాశీల్దార్ శైలజ ను కలిసి వినతి పత్రం అందించారు.రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన భూమి ఉన్నట్లైతే దాన్ని పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం మంజూరు చేయాలని వారు తహాశీల్దార్‌కు విజ్ఞప్తి చేసారు. అలాగే వార్డు 2లో ఒక సారి అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని కోరగా తహాశీల్దార్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే సర్వేయర్‌ను పంపి ప్రభుత్వ భూమి కోసం సర్వే నిర్వహించనున్నట్లు హామీ ఇచ్చారన్నారు.అనంతరం నయీం మాట్లాడుతూ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఇంచార్జి మర్రి రాజశేఖరరెడ్డి సూచనల మేరకు సికింద్రాబాద్ తహాశీల్దార్‌ను కలిసి సమస్యను వివరించినట్లు తెలిపారు.

## సివిల్స్‌లో పది శాతం తెలుగువారిని నిలబెట్టటమే లక్ష్యం

**ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ శ్రీకాంత్ విన్నకోట**

ధర్నాచౌక్, మే 24, ప్రభాతవార్త: సివిల్స్ సాధించిన వారిలో పదిశాతం తెలుగువారిని ఉంచటమే లక్ష్యంగా అనలాగ్ ఐఏఎస్ అకాడమీ కృషి చేస్తోందని ఆ సంస్థ డైరెక్టర్ శ్రీకాంత్ విన్నకోట స్పష్టం చేశారు. యూపీఎస్సీ సివిల్స్ ఫలితాలలో మూడవ ర్యాంకు, ఎనిమిదవ ర్యాంకులతో పాటు 64 ర్యాంకులు సాధించిన సందర్భంగా బుధవారం దోమలగూడలోని అనలాగ్ ఐఏఎస్ అకాడమీ కార్యాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ తెలుగు విద్యార్థులకు మంచి శిక్షణ అందించాలనే లక్ష్యంతో ఢిల్లీ నుండి ఎంతో అనుభవం ఉన్న ఫ్యాకల్టీలను పిలిపించి, తమ అకాడమీ ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నామని, దాని ఫలితంగా నేడు విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని తెలిపారు. ర్యాంకులు సాధించాలంటే కేవలం చదువుతూ ఉండటం ఒక్కటే మార్గం కాదని, రోజూ ప్రాక్టీస్‌తో పాటు రివిజన్, రోజు వారీ పరీక్షలు, హ్యాండ్ హోల్డింగ్ వంటివి ప్రధానమని అన్నారు. ఒకేసారి ర్యాంకు సాధించటం ఎవరికైనా కష్టమేనని, ర్యాంకు రాలేదని ఎవరూ నిరుత్సాహపడకుండా మరో అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా అన్నింటినీ సమర్థవంతంగా ఎదుర్కొని, శిక్షణ ఇచ్చే సమయంలో ప్రతి విద్యార్థిని వ్యక్తిగతంగా ప్రోత్సహిస్తూ, సలహాలు, సూచనలు అందించటంతో పాటు, ఉన్నతమైన స్టడీ మెటీరియల్ రూపొందించి, అభ్యర్థులకు శిక్షణ ఇవ్వటం అనలాగ్ ప్రత్యేకత అన్నారు. తమ అకాడమీలో అస్త్రా స్కాలర్‌షిప్ ద్వారా ప్రతి జిల్లా నుండి ముగ్గురిని సెలక్ట్ చేసి, వారికి ఫీ రాయితీ కల్పిస్తున్నామని తెలిపారు. గత 21 సంవత్సరాలుగా సుమారు 700 మందిని సివిల్ సర్వెంట్స్‌గా దేశానికి అందించటం ఎంతో ఆనందంగా ఉందని, దేశనిర్మాణానికి తమ వంతు బాధ్యతగా అనలాగ్ ఐఏఎస్ అకాడమీ పునరంకితం అయిందని పేర్కొన్నారు. అనంతరం పేద కుటుంబం నుండి 410వ ర్యాంకు సాధించిన దొంగ్రె రేవయ్యను అనలాగ్ అకాడమీ పక్షాన సత్కరించారు.

## పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు నామకరణం చేయాలి

**తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం కార్యదర్శి బి.రఘు ప్రధానికి విజ్ఞప్తి**

సైఫాబాద్, మే 24 ప్రభాతవార్త: ఈ నెల 28న ఢిల్లీలో నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఈ భవనానికి రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ పేరు నామకరణ చేయాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర కార్యదర్శి బదనాపురం రఘు విజ్ఞప్తి చేశారు. దేశంలోని కోట్లాది మంది ప్రజలకు ఆమోదయోగ్యంగా అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని, ఆయన సేవలను ప్రపంచ వ్యాప్తంగా గుర్తించడం జరిగిందని, ఐక్యరాజ్య సమితి సైతం ప్రపంచ మేధావిగా గుర్తించిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంకు సిఎం కెసిఆర్ డా.బి.ఆర్.అంబేద్కర్ పేరు నామకరణం చేశారని ఆయన గుర్తు చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే కేంద్ర ప్రభుత్వం పాలన కొనసాగిస్తున్న నేపథ్యంలో అంబేద్కర్ పేరు పెట్టడానికిగల అభ్యంతరం ఏమిటిని ప్రశ్నించారు. ప్రధాని పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు నామకరణ చేయాలని కోరారు.

## తెలుగుజాతి గౌరవ పతాకాన్ని ఎగురవేసింది ఎన్టీఆర్

**తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు**



జ్యోతిప్రకాసనంచేసి ఎన్టీఆర్‌కు నృత్యనీరాజనాన్ని ప్రారంభిస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, హీరో మురళీమోహన్, నటి కావ్య

రవీంద్రభారతి, మే 24 ప్రభాతవార్త : తెలంగుంబాష, స ంస్కృతి, సంప్రదాయాలు, కళలు, ఆత్మగౌరవాన్ని ప్రపంచా నికి చాటిన మహోన్న తుడు డా. నందమూరి తారక రామారావు అని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమో హన్‌రావు శ్లాఘించారు. మాంగళ్యం ఫౌండేషన్, రాధక సంగీత నృత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రవీం ద్రభారతి ప్రధాన మందిరంలో ఎన్.టి.రామారావు శతజయంతిని పురస్క రించుకొని శాస్త్రీయ, సంగీత నృత్యనీరాజనం పేరిట ఘననివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, జయభేరి అధినేత, ప్రముఖ సినీనటుడు, మాజీ పార్లమెంటు సభ్యుడు మురళీమోహన్, బలగం ఫేమ్ నటి కావ్య తదితరులు పాల్గొని జ్యోతిప్రకాసనంచేసి నృత్యప్రదర్శనలను లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. తెలుగుజాతి ఉన్నంతకాలం ఎన్టీఆర్ వారి చిరస్థాయిగా నిలిచే ఉంటారన్నారు. ఆయన శతజయంతి వైభవంగా నిర్వహిస్తూ నృత్యనీరాజనం సమర్పించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీనిర్మాత డా. బత్తిని కీర్తిలతగౌడ్, ప్రముఖ నాట్యగురువులు ఇందిరా పరాశరం, డా. బిందు అభినయ్, రంగమణి, రాధిక, రాజేశ్వరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫలక్‌నుమా ఎసిపి షేక్ జహంగీర్‌కు అడిషనల్ ఎస్‌పిగా పదోన్నతి



చార్మినార్, మే 24 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీలో అత్యంత కీలకమైన ఫలక్‌నుమా డివిజన్ ఎసిపిగా విధులు నిర్వహిస్తున్న షేక్ జహంగీర్ అడిషనల్ ఎస్‌పిగా పదోన్నతి పొందారు. అడిషనల్ ఎస్‌పిగా పదోన్నతి లభించిన షేక్ జహంగీర్ తెలంగాణ రాష్ట్రంలోని రాచకొండ, తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ, ఖమ్మం సిసిఎస్‌లో ఎసిపిగా పని చేశారు. సంవత్సరం క్రితం షేక్ జహంగీర్ ఖమ్మం నుంచి ఫలక్‌నుమా ఎసిపిగా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఫలక్‌నుమా డివిజన్ ఎసిపిగా విధులు నిర్వహిస్తున్న షేక్ జహంగీర్‌కు అడిషనల్ ఎస్‌పిగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.కాగా విధి నిర్వాహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన హైదరాబాద్ పాతబస్తీ ఫలక్‌నుమా ఎసిపి షేక్ జహంగీర్‌కు కొద్ది రోజుల క్రితం రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్ అలీ తెలంగాణ రాష్ట్ర ఉత్తమ సేవా పతకం అందజేసిన విషయం విధితమే.

## ధర్మకర్తలు ఆలయ అభివృద్ధికి పాటుపడాలి : మంత్రి తలసాని



మారేడ్‌పల్లి శ్రీ సుబ్రమణ్య స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ శ్రీకారోత్సవంలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఆలయ చైర్మన్ సంతోష్ యాదవ్, ఈఓ సుధాకర్, ఏసి శేఖర్ తదితరులు

కంటోన్మెంట్, మే 24 ప్రభాతవార్త: భక్తులకు ఎలాంటి అ సౌకర్యం కలుగకుండా ఆలయ అభివృద్ధికి ఆలయ అబివృద్ధికి ధర్మకర్తలు కృషి చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక,సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచినశ్రీ సుబ్రమణ్య స్వామి దేవాలయం నూతన పాలక మండలి ప్రమాణశ్రీకారోత్స వానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అండాలు నూతన ధర్మకర్తలతో ప్రమాణం చేయించారు. అనంతరం కమిటీ సభ్యులకు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ దేవదాయ శాఖ అధికారులు, ధర్మకర్తలు, అర్చకులు కలిసి సమన్వయంతో ఆలయ అభివృద్ధికి పాటుపడాలన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ఆలయాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. ఆలయం ముందు ఉన్న రోడ్లు,డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి తానే నిధులు మంజూరు చేయించామన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్‌గా చిర్రబోయిన సంతోష్ యాదవ్‌ను నియమించినట్లు ప్రకటించారు. ఆలయ ధర్మకర్తలుగా చొల్లేటి రమేష్, వేణుగోపాల్ చారి, నర్సింగ్‌రావ్, జి.నాగేందర్ యాదవ్, జోగుల భాస్కర్, కె.పద్మజలను ధర్మకర్తలుగా, ఎక్స్ అఫిసియో మెంబర్‌గా ఆలయ ప్రధాన అర్చకులు టి.రాజేశ్వర్మలను నియమించినట్లు మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, ఇన్‌స్పెక్టర్ అండాలు, ఆలయ ఈఓ సుధాకర్ యాదవ్, దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు మాజీ కార్పొరేటర్ లాస్య నందిత, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలు పిట్ల నాగేశ్, నాగినేని సరిత, ఉమా శంకర్ పాల్గొన్నారు.

## ఐవిఎఫ్ ద్వారా గర్భం దాల్చిన జంటలను సత్కరించిన ఒయాసిస్ ఫెర్టిలిటీ

బేగంపేట మే 24,ప్రభాతవార్త : ఐవిఎఫ్ ద్వారా గర్భం దాల్చిన జంటలను ఒయాసిస్ ఫెర్టిలిటీ సత్కరించింది. సికింద్రాబాద్ ఒయాసిస్ ఫెర్టిలిటీ క్లినికల్ హెడ్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ పరినాజ్ పర్వార్ ఆధ్వర్యంలో గర్భం దాల్చిన జంటలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంతానం కలగకపోవడాన్ని కళంకంగా భావిస్తున్న కారణంగా కొన్ని కుటుంబాలు కొంత మానసిక వేదనకు గురవుతున్నాయి.సరైన వైద్యం ద్వారా మాత్రమే జంటలు తాము తల్లి దండ్రులు అయ్యే కలను సాకారం చేయడంలో సహాయ పడుతుంది.మొత్తం 15శాతం మంది వరకు సంతాన లేమి సమస్యలతో బాధపడుతుండగా అందులో కేవలం 3శాతం మంది మాత్రమే సంతాన సాఫల్య చికిత్స సహాయాన్ని తీసుకుంటున్నారు.అస్థిర జీవన శైలి, ఊబకాయం, ధూమపానం వైద్య పరమైన కారణాలు పర్యావరణ కారకాలు భారత దేశంలో సంతానలేమి సమస్య పెరగ డానికి ప్రధాన కారణాలుగా మారాయన్నారు.ఈ సందర్భంగా ఆమె తల్లులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు.

## పేదింటి ఆడబిడ్డ పెళ్లికి సహాయం



వధువుకు పుస్తెమట్టెలు అందజేస్తున్న మాజీ సర్పంచ్ కావలి గణేష్

దుండిగల్, మే 24 ప్రభాతవార్త : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి 5వార్డులో నివాసం ఉంటున్న బ్యాగరి రమేష్, లక్ష్మీ దంపతుల కుమార్తెకు వివాహం కుదిరింది. రమేష్,లక్ష్మీ దంపతులది నిరుపేద కుటుంబం కావడంతో కుమార్తె వివాహం చేసేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోం టున్నారు. విషయం తెలుసుకున్న మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు సర్పంచ్ కావలి గణేష్ బుధవారం వారికి ఇంటికి వెళ్లి పుస్తె మట్టెలను అందజేశారు. ఈసందర్భంగా రమేష్ కుటుంబ సభ్యులు గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్రాంతికుమార్, దేవా తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్,డిగ్రీ,పిజి విద్యను ఉచితంగా అందిస్తాం



విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థినీతో మాట్లాడుతున్న జి.జి.వై.ఎఫ్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్

బేగంబజార్,మే24 ప్రభాతవార్త: గడ్డం గంగాధర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోషామహల్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థీ, విద్యార్థులకు ఇంటర్,డిగ్రీ,పిజి విద్యను ఉచితంగా అందిస్తామని గడ్డం గంగాధర్ ఫౌండేషన్,బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.ఉచితంగా ఇంటర్, డిగ్రీతోపాటు పిజి విద్యను అందించే ప్రక్రియ మొదలు పెట్టినట్లు చెప్పారు. విద్యార్థినీ,విద్యార్థుల తల్లిదం డ్రులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు.అన్ని వర్గాల విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలన్నారు.

## లక్షలాది రూపాయల వ్యయంతో గ్రంథాలయాల అభివృద్ధి

**నగర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ప్రసన్న రామ్మూర్తి**



గ్రంథాలయ భవనానికి భూమి పూజ చేస్తున్న నగర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ప్రసన్న రామ్మూర్తి తదితరులు

చిక్కడపల్లి, మే 24 ప్రభాతవార్త: నగర కేంద్ర గ్రంథాలయం పరిధిలోని 81 శాఖా గ్రంథాలయాలకు రూ.65లక్షలతో నూతన పుస్తకాలను కొనుగోలు చేసి పాఠకులకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని అశోక్‌నగర్ నగర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ప్రసన్న రామ్మూర్తి అన్నారు. అశోక్‌నగర్‌లోని నగర కేంద్ర గ్రంథాలయంలో ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఉప్పుగూడలో నిర్మించతలపెట్టిన నూతన భవనానికి ఈ రోజు భూమి పూజను సంస్థ కార్యదర్శి ఎం.పద్మజతో కలిసి చేయడం జరిగిందన్నారు. పుస్తకాలు కొనుగోలు చేయడం వల్ల పోటీపరీక్షల అభ్యర్థులకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు మరెన్నో లక్షలతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. సికింద్రాబాద్‌లో రూ.3కోట్ల వ్యయంతో అత్యాధునిక గ్రంథాలయం నిర్మించామన్నారు. ప్రతి రోజు అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయానికి 3వేల మంది పాఠకులు, పోటీపరీక్షల అభ్యర్థులు వస్తుంటారన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్, పౌరగ్రంథాలయాల శాఖ డైరెక్టర్ శ్రీనివాస్‌చారి నేతృత్వంలో పలు అంశాలపై చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## సోసిన్ రేవెళ్ల ఇచ్చిన ప్రోత్సాహంతో సివిల్స్‌లో ర్యాంకు వచ్చింది

చిక్కడపల్లి, మే 24 ప్రభాతవార్త: ఆంత్రోపాలజీ సబ్జెక్ట్ నిపుణురాలు సోసిన్ రేవెళ్ల ఇచ్చిన ప్రోత్సాహం వల్లనే సివిల్స్ సర్వీసెస్ పరీక్షల్లో ర్యాంకు రావడానికి దోహద పడిందని 22వ ర్యాంకర్ పవన్ దత్త అభిప్రాయపడ్డారు. పవన్‌దత్తా బుధవారం అశోక్‌నగర్‌లోని సోసిన్ క్లాసెస్ ఐఏఎస్ అకాడమి సంస్థ అధినేత్రి, ఆంత్రోపాలజీ సబ్జెక్ట్ నిపుణురాలు సోసిన్ రేవెళ్ల ఆధ్వర్యంలో ర్యాంకర్ పవన్ దత్తను ఘనంగా సత్కరించి అభినందించారు. ఉదయం నుంచి రాత్రి వరకు చదవాలని ఏమిలేదని, తాను సివిల్స్ పరీక్షను ఎలాంటి ఆందోళన లేకుండా సన్నద్ధమై మొదటి ప్రయత్నంలోనే తాను ఈ ఘనత సాధించానని అన్నారు. తాను డాక్టర్‌ను కావడం వల్ల ఇంటర్వ్యూలో మెడికల్ రంగం నుంచి ప్రశ్నలు వచ్చాయన్నారు. దేశంలోనే ఆంత్రోపాలజీ సబ్జెక్ట్‌లో ప్రముఖులు అని సోసిన్ రేవెళ్ళ అని, తనకు ఈ సబ్జెక్ట్‌లో అత్యధిక మార్కులు వచ్చి ఉంటే ఆ ఘనత సోసిన్ రెవెళ్ళకే దక్కుతుందని అన్నారు. సోసిన్ రెవెళ్ళ మాట్లాడుతూ సివిల్స్ రాయడానికి వస్తున్న యువత మొదటి ప్రయత్నంలోనే సాధించడం అనూహ్య పరిణామం అని అన్నారు.

## "బ్రహ్మణ భవన్" ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి

**భారతీయ భాగ్యనగర అర్చక పురోహిత సంఘం అధ్యక్షులు గట్టు శ్రీనివాసాచార్యులు**



బ్రాహ్మణభవన్ నిర్మాణప్రాంతాన్ని పరిశీలిస్తున్న గట్టు శ్రీనివాసచార్యులు తదితరులు

హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త: ఈనెల 31న కోకాపేట్ సమీపంలోని గోపనపల్లిలో 6ఎకరాలల్లో 12కోట్ల నిధులతో నిర్మించిన "బ్రాహ్మణ భవన్ " ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారతీయ భాగ్యనగర అర్చక పురోహిత సంఘం పిలుపునిచ్చింది. ఈమేరకు బుధవారం గోపన్‌పల్లిలోని భవన నిర్మాణ ప్రాంతాన్ని సంఘం ప్రతినిధులు సందర్శించి ఏర్పాట్లు పరిశీలిం చారు. ఈసందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు గట్టు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ బ్రాహ్మణ సముదాయాన్ని నిర్మించి బ్రహ్మణ సమాజానికి అకింతం చేయబోతున్న సిఎం కెసిఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఇప్పటివరకు బ్రాహ్మణులకు ఏప్రభుత్వం చేయలేని పనిని సిఎం కెసిఆర్ చేశాడన్నారు. ఈకార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి బ్రాహ్మణులు వేలాదిగా తరలివచ్చి విజయతవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## టిఎన్‌జిఓ విద్యాశాఖ ఆధ్వర్యంలో హిద్‌మిలాప్



హిద్ మిలాప్‌లో పాల్గొన్న ముజీబ్‌హుస్సేనీ,కె.ఆర్.రాజ్‌కుమార్ తదితరులు

గన్‌ఫౌండ్రి,మే 24ప్రభాతవార్త: పండుగలు మత సామరస్యానికి ఎంతో దోహదపడుతాయని తెలంగాణ హైదరాబాద్ నాన్‌గజి టెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ అన్నారు.మంగళవారం తెలంగాణ నాన్‌గజిటెడ్ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హిద్‌మిలాప్ కార్యక్ర మంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ హైదరాబాద్ జిల్లా ఉద్యోగుల ఐక్యతతో ముందుసాగడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఈకార్యక్రమంలో ఆర్‌జెడిఎస్‌ఇ జిల్లా అధికారి విజయలక్ష్మి,అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి,జిల్లా కార్యదర్శి విక్రమ్‌కుమార్, విద్యాశాఖ అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.బాస్కర్,కోశాధికారి ఎస్.డి.ప్రేమ్‌కుమార్, బి.రవికుమార్, రుగేష్,ఎం.ఎ.ముక్తార్,జయంతి,ప్రియదేవ్,అఖిల్,నూర్య,మిర్జా,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేద వీధి వ్యాపారుల షెడ్ల నిర్మాణాలను పరిశీలించిన మంత్రి



పేద వీధి వ్యాపారుల కోసం నిర్మిస్తున్న షెడ్డులను పరిశీలించి కూర్చున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, మే 24 ప్రభాతవార్త: హైదరాబాద్ నగర శివార్లలోని మీర్‌పేట్‌లో వీధి వ్యాపారుల కోసం నూతనంగా నిర్మిస్తున్న షెడ్లను బుధవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే పరిశీలించారు. మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని రోడ్ల పక్కన ఇబ్బందికర ప్రమాదకర పరిస్థితుల్లో చిరు వ్యాపారుల కోసం మంత్రి స్థానిక మీర్‌పేట్ మంత్రాల చెరువు పక్కన ఉన్న స్థలంలో కార్పొరేషన్ తరపున వ్యాపార షెడ్లను నిర్మిస్తున్నారు. అయితే బుధవారం ఆమె వాటిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పనులు త్వరిత గతిన పూర్తి చేసి చిరు వ్యాపారులకు అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమీషనర్ చిట్టి నాగేశ్వరరావు, డిఇఇ గోపినాథ్, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో హరిజన అభ్యుదయ సంఘం మాజీ అధ్యక్షులు వంటెపాక జ్ఞానేశ్వర్ మృతి



పురానాపూల్, మే 24 ప్రభాతవార్త: మాజీ జర్నలిస్టు, మాజీ హరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షులు వంటెపాక జ్ఞానేశ్వర్ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. పురానాపూల్ స్వామి వివేకనందనగర్ హరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షులుగా, జర్నలిస్టుగా ప్రజలకు సేవలను చేశారు. గత కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న జ్ఞానేశ్వర్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచాడు. విషయం తెలుసుకున్న బస్తీవాసులు ఆయన నివాసానికి చేరుకున్నారు. గురువారం మధ్యాహ్నం 2గంటలకు పురానాపూల్ శ్మశాసన వాటికలో అంతిమ సంస్కారాలు జరుగుతాయన్నారు. జర్నలిస్టుగా సేవలను అందించిన వంటెపాక జ్ఞానేశ్వర్‌కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన మరణం తీరనిలోటన్నారు.

# కుత్బుల్లాపూర్ లో భూగర్భ డ్రైనేజీ, సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ

**కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్ ఎంఎల్ఏ కె.పి.వివేకానంద్, గౌరీష్‌లను సత్కరిస్తున్న స్థానికులు

కుత్బుల్లాపూర్, మే 24 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలో అపరిష్కృతంగా వున్న భూగర్భ డ్రైనేజీ, సిమెంట్‌రోడ్ల పనులను తక్షణం చేపట్టాలని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ ఆదేశించారు. కుత్బుల్లాపూర్ డివిజన్ వాజ్‌పాయ్‌నగర్‌లో 66వరోజు ప్రగతియాత్రలో భాగంగా స్థానిక మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్‌తో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా దేవరకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన పూర్తి సహాయ, సహకారాలు అందిస్తానని హామీఇచ్చారు. కుత్బుల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్ మాట్లాడుతూ ప్రజలకు డివిజన్ పరిధిలో ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చినట్లు పేర్కొన్నారు. మిగిలిన భూగర్భ డ్రైనేజీ, సిమెంట్ రోడ్ల పనులను కూడా వెంటనే చేపట్టేందుకు అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యూటీ ఇంజనీరు పాపాయమ్మను వివిధ పనులను పూర్తిచేసందుకు తగిన చర్యలు తీసుకోవాలని శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ ఆదేశించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ డివిజన్ తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, కార్యదర్శి సత్తిరెడ్డి,యోజకవర్గ టిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్‌యాదవ్, టిఆర్ఎస్ మహిళా విభాగం నాయకులు, మాజీ కౌన్సిలరు ఇందుకూరి సూర్యప్రభ రమణరాజు,టిఆర్ఎస్ నేతలు బోలోజు కిశోర్‌చారి, నార్లకంటి బాలయ్య, బాస్కర్‌రాజు, ఉమేశ్, యాదగిరి, జయంచారి, జాలిగం రాకేశ్, నజీర్, బ్రిజేశ్, వెంకటరమణి, జానకి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎన్‌డిపి నాలా పనుల పూర్తికి చర్యలు: మంత్రి సబితారెడ్డి


అసంపూర్తి ఎస్ఎన్‌డిపి పనులను పరిశీలిస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, మే 24 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అసంపూర్తిగా ఉన్న ఎస్ఎన్‌డిపి నాలా పనులు త్వరలో పూర్తయ్యేటట్లు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. నాలా పనులు జరుగుతున్న కార్పొరేషన్‌లోని 36వ డివిజన్ ఎంఎల్ఆర్ కాలనీ, 32వ డివిజన్ అయోధ్యనగర్, 31వ డివిజన్ జనప్రియా మహానగర్‌లలో బుధవారం మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె కమీషనర్ చిట్టి నాగేశ్వర్‌రావు, డిఇఇ గోపినాథ్, మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, స్థానిక కార్పొరేటర్లు వేముల నర్సింహ, పాలమూర్తి విజయలక్ష్మి రాజు తదితరులతో కలిసి పాదయాత్రలు చేస్తూ అసంపూర్తిగా ఉన్న ఎస్ఎన్‌డిపి నాలా పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తయ్యే విధంగా చూస్తామని వెల్లడించారు. స్థానిక కాలనీవాసులు ఎలాంటి ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని ఆమె భరోసా ఇచ్చారు. అనంతరం ఆమె మంత్రాల చెరువు సమీపంలో ఆర్‌సిఐ రోడ్డు వద్ద నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ బ్రిడ్జ్ పనులను పరిశీలించి వాటిని త్వరితగతిన పూర్తి చేయించాలని అధికారు లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ ఎఇఇ శ్రీనివాసులు, ఎస్ఎన్ డిపికి సంబంధించిన అధికారులతో పాటు బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, ఉయ్యాల నవీన్‌గౌడ్, కో-ఆప్షన్ సభ్యుడు పల్లె జంగయ్యగౌడ్, మీర్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్‌గౌడ్, ఎంఎల్ఆర్, అయోధ్యనగర్, జనప్రియా మహానగర్ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**నిధులు కేటాయించినందుకు సబితమ్మకు కాలనీవాసుల కృతజ్ఞతలు**

కాగా మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 32వ డివిజన్‌లో రోడ్ల నిర్మాణాలకు సుమారు కోటి రూపాయలకు పైగా నిధులు కేటాయించిన మంత్రి సబితా ఇంద్రారెడ్డికి స్థానిక కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్ వేముల నర్సింహ ఆధ్వర్యంలో న్యూ అయోధ్యనగర్, అయోధ్యనగర్, బాలాజీనగర్, ఎల్ఎల్ఎన్ఎస్ కాలనీ ఫేజ్-2, హుడా కాలనీలకు చెందిన పలువురు మంత్రిని సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.

## మీర్‌పేట్ దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఎమ్మార్వోకు వినతి

**సరూర్‌నగర్, మే 24 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలం మీర్‌పేట్ గ్రామానికి సంబంధించిన సర్వే నెంబర్ 46, 61లలోని భూమిలో తరతరాలుగా వ్యవసాయం చేసిన దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని మీర్‌పేట్ కార్పొరేషన్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దాసరి బాబు ఎమ్మార్వో జనార్ధన్‌రావును కోరారు. ఈ మేరకు ఆయన పలువురు దళితులతో కలిసి ఎమ్మార్వోకు ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ సర్వే నెంబర్ 41, 61లలో రెండు ఎకరాలు పార్కు కోసం అని 8 ఎకరాలు కేటాయిస్తున్నారనీ దీని వల్ల గ్రామ దళితులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పార్కుకు రెండు ఎకరాలు మాత్రమే కేటాయించి మిగతా భూమిని వ్యవసాయం చేసిన దళిత కుటుంబాలకు దక్కేటట్లు పొజిషన్ ఇప్పించాలని ఆయన కోరారు.

## బిఆర్ఎస్ ఎస్టీ నేతకు మంత్రి పరామర్శ

**సరూర్‌నగర్, మే 24 ప్రభాతవార్త:** పితృ వియోగం కలిగిన బాలాపూర్ బిఆర్ఎస్ నాయకుడు గోపాల్ నాయక్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. బాలాపూర్‌కు విచ్చేసిన మంత్రి గోపాల్ నాయక్ తండ్రి శంకర్ నాయక్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం గోపాల్ నాయక్‌ను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, గుండోజు రఘునందనచారి, కళ్లెం ఎల్లారెడ్డి, జూకంటి సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి : అబ్రార్


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అబ్రార్ తదితరులు

**మలక్‌పేట, మే 24 ప్రభాతవార్త:** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని అజంపుర డివిజన్ ఎంఐఎం నాయకుడు అబ్రార్ పేర్కొన్నారు. డివిజన్‌లోని డిసి పటేల్ కాలనీలో కొనసాగుతున్న నూతన రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడడం జరిగిందని, త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

### శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికుల వినతి

**నేరెడ్‌మెట్, మే 24 ప్రభాతవార్త:** వేసవి కాలంలో విద్యుత్ అంతరాయం అంటూ విద్యుత్ అధికారులు ఇస్తున్న ప్రకటనల కారణంగా పలు సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే ఎండాకాలం ఒక్క నిమిషం కూడా కరెంటు లేకపోతే ప్రజలు ఇంట్లో ఉండలేని పరిస్థితులు ఉన్నాయి. ఇటువంటిసమయంలో విద్యుత్ కోత అంటూ అధికారులు విద్యుత్ వినియోగదారులకు కష్టాలు తెచ్చిపెడుతున్నారని పలువురు వాపోతున్నారు. ఆనంద్ బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 7గంల నుండి 11గంల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని చెప్పిన అధికారులు సాయంత్రం 4గంటల తర్వాత విద్యుత్ సరఫరా అందించడం ఏ మాత్రం సమంజసం కాదని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యుత్ వినియోగదారులకు సరైన సమాచారం ఇవ్వకుండా విద్యుత్ అధికారులు ఇష్టానుసారంగా కరెంటు తీసివేయడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మే 20వ తేదీన కూడా విద్యుత్‌ను 3గంటలు నిలిపి వేస్తామని చెప్పి సాయంత్రం 6గంటలకు విద్యుత్ సరఫరా చేసారని తెలిపారు. ఉదయం నుండి సాయంత్రం వరకు విద్యుత్ లేకపోవడంతో ఫ్యాన్లు లేక ఉక్కిరి బిక్కిరై, చల్లటి నీరు తాగలేని పరిస్థితి నెలకొందన్నారు. సరైన సమయ పాలన పాటించకుండా, చెప్పిన సమయానికి విద్యుత్‌ను అందించలేకపోయని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పవర్ బోర్‌కు మరమ్మతులు చేయించాలని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌కు స్థానికుల వినతి


మరమ్మతులు చేయించాలని కార్పొరేటర్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

**మల్కాజిగిరి, మే 24 ప్రభాతవార్త :** ఈస్ట్‌ఆనంద్‌భాగ్ డివిజన్ పరిధిలోని కస్తూరిబానగర్‌లో పవర్ బోర్ పాడైందని దానికి మరమ్మతులు చేయించాలని స్థానిక కాలనీవాసులు కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వెంటనే కార్పొరేటర్ స్పందించి వెంటనే అధికారుల తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబు, కాలని వాసులు గఫూర్, హబీబ్, బాబా, బషీర్, సంతోష, శాంతాబాయ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లలో దొంగ ఓట్లను తొలగించాలి: బిఎస్‌పి గుడ్ల శ్రీనివాస్


అఖిల పక్ష సమావేశంలో మాట్లాడుతున్న బిఎస్‌పి అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్

**సరూర్‌నగర్, మే 24 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్లు, జల్‌పల్లి మున్సిపాలిటీల్లో నమోదైన దొంగ ఓట్లను తొలగించాలని మహేశ్వరం నియోజకవర్గ బిఎస్‌పి అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ అధికారులను కోరారు. బుధవారం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బాలాపూర్ ఎమ్మార్వో జనార్ధన్‌రావు, మీర్‌పేట్ కమీషనర్ చిట్టి నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎస్‌పి తరఫున గుడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల వారు భారీగా దొంగ ఓట్లను నమోదు చేశారీ ఈ మేరకు విచారణ జరిపి సదరు ఓట్లను గుర్తించి తొలగించాలని సూచించారు. అదే విధంగా ఆధార్ కార్డుతో ఓటర్ కార్డుకు లింక్ చేయాలని అన్నారు. రెండు చోట్ల ఓటరుగా నమోదై ఉన్న వారికి ఒకే చోట మాత్రమే ఉంచాలని కోరారు. ఓటర్ల జాబితాను సక్రమంగా రూపొందించిన పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు పెంచాలని, బిఎల్ఓలకు ఐడి కార్డులు ఇచ్చి భత్యాలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, బిఎల్ఓలు పాల్గొన్నారు.

## ఇన్స్‌పెక్టర్ మహేందర్‌రెడ్డి సేవలు మరువలేనివి

**సరూర్‌నగర్, మే 24 ప్రభాతవార్త:** మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్‌గా మద్ది మహేందర్‌రెడ్డి అందించిన సేవలు మరువలేనివని కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి అన్నారు. మీర్‌పేట్ నుండి ఘట్కేసర్ పిఎస్‌కు బదిలీ అయిన మహేందర్‌రెడ్డిని బుధవారం గోపాల్‌రెడ్డి సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మహేందర్‌రెడ్డి సమర్థవంతంగా విధులు నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్నారని అన్నారు. వివక్ష లేకుండా అన్ని పార్టీల వారికి ప్రాధాన్యతనిచ్చారని గుర్తు చేశారు.

## జల్‌పల్లి మున్సిపాలిటీ ఎస్ఎన్‌డిపి పనుల పరిశీలన

**సరూర్‌నగర్, మే 24 ప్రభాతవార్త:** జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొత్త మానుకుంట, నబీల్‌కాలనీ, డ్రీమ్‌సిటీ, గ్రీన్‌సిటీ తదితర ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న ఎస్ఎన్‌డిపి నాలా నిర్మాణపు పనులను బుధవారం మంత్రి సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్లా సాది, కమీషనర్ వసంత, పలువురు కౌన్సిలర్లు, బిఆర్ఎస్, ఎంఐఎం నాయకులు తదితరులతో కలిసి కాలనీల్లో పర్యటించి నాలా పనుల స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, బడంగ్‌పేట్, జల్‌పల్లి కో-ఆప్షన్ సభ్యులు గుండోజు రఘునందనాచారి, ఎస్‌కె ఖలీల్ పాష, సూరెడ్డి కృష్ణారెడ్డిలతో పాటు రామిడి రాంరెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, సురేష్‌గౌడ్, ఎక్బాల్ బిన్ ఖలీఫా, సిల్వేరి సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యానవన అభివృద్ధి కోసం బోర్ పనులకు శంకుస్థాపన : సుజాతనాయక్


బోర్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

**వనస్థలిపురం, మే 24 ప్రభాతవార్త:** హస్తినపురం డివిజన్‌లోని దత్తనగర్‌లో బుధవారం కార్పొరేటర్ బానోత్ సుజాతనాయక్ పర్యటించారు. దత్తనగర్‌లోని ఉద్యానవనం అభివృద్ధి కోసం వేస్తున్న బోర్‌ను ఆమె ప్రారంభించారు. గత కొంత కాలం క్రితం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో దత్తనగర్ పార్క్ అభివృద్ధికోసం హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ వారినుంచి సుమారు 85లక్షలు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన ఉద్యానవనాన్ని అభివృద్ధి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రో డెవలప్మెంట్ అథారిటీ అసిస్టెంట్ ఇంజనీర్ జీవన్‌రెడ్డి, దత్తనగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు గోపాల్ అభిషేక్, కనకదుర్గ, ఎల్లయ్య, బిఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పద్మిని, ఆదిలక్ష్మి, రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు జరగడానికి సహకరించాలి : స్థానికులు

**మలక్‌పేట, మే 24 ప్రభాతవార్త:** అజంపుర డివిజన్ రాజనర్సింహ్మానగర్‌లో చేపడుతున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు సహకరించాలని స్థానికులు పేర్కొన్నారు. ఈ సందరభంగా వారు ప్రభాత వార్త ప్రతినిధితో మాట్లాడుతూ మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే రాజనర్సింహ్మానగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని, స్థానికంగా సుమారు 250 నివాసాలు ఉండగా, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు అందరూ అంగీకరించడం జరిగిందని, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనలకోసం ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రభుత్వ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టడడం జరిగిందని ఒకరిద్దరూ మాత్రమే కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఆటంకం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరైన పద్దతి కాదన్నారు.

## సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలి : కార్పొరేటర్ కళ్లెం


పేరుకుపోయిన మురుగును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, మే 24 ప్రభాతవార్త:** కాలనీల్లో మురుగు సమస్య లేకుండా చూడాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో సాధ్యమయినంత త్వరగా పూర్తి చేయాలని హయత్‌నగర్‌కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఆయన డివిజన్ పరిధిలోని ఆర్టీసీ మజ్దూర్‌కాలనీ, సిద్ధి వినాయక కాలనీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఆర్టీసీ మజ్దూర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ అవుట్ లెట్ సమస్య కారణంగా మురుగునీరు మ్యాన్ హోళ్ల నుంచి బయటకు రావడంతో దుర్వాసన వస్తోందని, దోమలు ఎక్కువై కాలనీవాసులు అనారోగ్యంపాలయ్యే ప్రమాదముందన్నారు. మురుగు నీరు సాఫీగావెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సిద్ధి వినాయక కాలనీలో కొనసాగుతున్న డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. డ్రైనేజీ పైప్‌లైన్ల ఏర్పాటులో లెవెల్స్‌ను సరిచూసుకోవాలని, మ్యాన్‌హోళ్ల నిర్మాణంలో నాణ్యతను అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అంతర్గత రోడ్ల పక్కన కూడా డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరగా... అధికారులతో మాట్లాడి కాలనీలో పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రధాన రోడ్డులో డ్రైనేజీ పూర్తయిన వెంటనే సీసీ రోడ్డును కూడా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా కాలనీల ప్రతినిధులు సూర్య, చంద్రశేఖర్, నర్సింగ్, నర్సింహాచారి, కిషన్‌నాయక్, మూర్తి పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని జడ్‌సి పంకజకు కార్పొరేటర్ గీత వినతి

**నాచారం, మే 24 ప్రభాతవార్త:** చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికోసం నిధులు కేటాయించాలని కోరుతూ జోనల్ కమీషనర్ పంకజకు స్థానిక కార్పొరేటర్ కార్పొరేటర్ బన్నాల గీతప్రవీణ్‌ముదిరాజ్ వినతి పత్రాన్ని అందజేశారు. అదే విదంగా నిధులు మంజూరైన పనులకు టెండర్లు పిలువాలని కార్పొరేటర్ కోరారు. ఈస్ట్ కళ్యాణ్‌పురి కమ్యూనిటీ హాల్‌కు అదనపు అంతస్తుకు నిధులు, సీతారామకాలనీలో వాటర్‌లైన్, సీసీ రోడ్ల ఏర్పాటు, కుమ్మరి సంఘం స్మశాన వాటికలో మౌలిక సదుపాలయ కోసం నిధులు కేటాయించాలని కార్పొరేటర్ బన్నాల గీతప్రవీణ్‌ముదిరాజ్ జెడ్‌సీకి వినతి పత్రంలో కోరారు. రాఘవేంద్ర నగర్ కమ్యూనిటీ హాల్ కోసం మంజూరు చేసి ప్రహారీగోడ నిర్మాణంకోసం నిదులు కేటాయించాలని కోరారు. అదేవిదంగా టెండర్లు వచ్చిన పనులను ప్రారంభించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బానాల నారాయణ రెడ్డి, ఎండీ మహామూద్, ఎండీ షఫీ,ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదానికి గురైన నిరుపేద యువతి వైద్య చికిత్సకు మంత్రి సబితారెడ్డి ఆపన్న హస్తం


కాలు కోల్పోయిన యువతికి ఎల్‌ఓసిని అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

**సరూర్‌నగర్, మే 24 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదానికి గురై కాలు కోల్పోయిన నిరుపేద యువతి వైద్య చికిత్సకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ఆపన్న హస్తం అందించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్ గుల్ 8వ డివిజన్‌కు చెందిన షర్మిల అనే యువతి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రి పాలైంది. కాలు కోల్పోయిన ఆమె వైద్య ఖర్చులను భరించలేని కుటుంబ సభ్యులు మాజీ కౌన్సిలర్ ఇంద్రపల్లి యాదగిరి, బిఆర్ఎస్ బిసి సెల్ అధ్యక్షుడు కోటగిరి జంగయ్యల సహకారంతో మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో స్పందించిన సబితారెడ్డి సిఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ.1.50 లక్షల ఎల్‌ఓసిని మంజూరు చేయించి మిగతా వైద్య ఖర్చులను తాను వ్యక్తిగతంగా అందజేస్తానని హామీనిచ్చారు. బుధవారం ఎల్‌ఓసిని షర్మిలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, జంగయ్య, కొండ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పిసిసి ప్రోటోకాల్ కమిటీ కార్యదర్శిగా బొజ్జ వెంకట్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మే 24 ప్రభాతవార్త :** చైతన్యపురి డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొజ్జ వెంకట్‌రెడ్డి పిపిసిసి ప్రోటోకాల్ కమిటీ కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈ మేరకు టీపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఉత్తర్వులను జారీచేశారు. వెంకట్‌రెడ్డి గతంలో ఎల్బీనగర్ టౌన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షునిగా, ప్రధానకార్యదర్శిగా, డివిజన్ అధ్యక్షునిగా, వార్డు కమిటీ సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ప్రోటోకాల్ కమిటీ కార్యదర్శి బాధ్యత అప్పగించారని పార్టీ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం నిరంతరం పనిచేస్తామన్నారు. కర్ణాటక రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీని బలపరిచారని రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.


డివిజన్లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసే విధంగా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. (ఎల్.బి.నగర్, ప్రభాతవార్త)

## మంచి నీరు కలుషితం కాకుండా పటిష్టమైన చర్యలు : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మే 24 ప్రభాతవార్త :** మంచినీరు కలుషితం కాకుండా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. ఎల్‌బినగర్ వాటర్ వర్క్స్ అధికారులతో బుధవారం ఎమ్మెల్యే నివాసంలో సమావేశం నిర్వహించారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులుకలగకుండా ఎక్కడ సమస్య వచ్చినా వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. పలుచోట్ల యూజీడి లైన్స్ ప్రక్కనే వాటర్ లైన్స్ ఉండడం వల్ల మంచినీరు కలుషితమవుతున్నాయని తెలిపారు. అటువంటి సమస్య ఉన్న ప్రాంతాలను గురించి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఒక్క ఇంటికి మంచినీరు అందించాలని ఆదేశించారు. ఆలాగే యూజీడీ వ్యవస్థ సరిగ్గా లేని కాలనీలలో కూడా నూతన డ్రైన్స్ పైప్‌లైన్ నిర్మాణ పనులు వేయాలని, గత వరదల్లో కొన్ని కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిన్న చోట పునర్నిర్మాణం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బినగర్ సర్కిల్ జలమండలి జనరల్ మేనేజర్ వినోద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డిపై ఛీటింగ్ కేసు నమోదు


విలేకరుల సమావేశంలో సామ జంగారెడ్డి, రాజు, మహేశ్వర్‌రెడ్డి

**వనస్థలిపురం, మే 24 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డిలపై వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో ఛీటింగ్ కేసు నమోదు అయ్యింది. హయత్‌నగర్ డివిజన్ కమలానగర్‌కు చెందిన సామ జంగారెడ్డి రైతు బజార్ సమీపంలోని సంపూర్ణ థియేటర్‌లో తనకు 15శాతం వాటా ఉందని, గత 10సంవత్సరాలుగా సామ రంగారెడ్డి సామ ప్రభాకర్‌రెడ్డిలు థియేటర్‌కు సంబంధించిన లావాదేవీలను తనకు చూపించకుండా, తనకు రావాల్సిన వాటా డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని గత కొద్ది రోజుల క్రితం వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సివిల్ తగాదాగా భావించిన పోలీసులు సామ రంగారెడ్డిపై కేసు నమోదు చేయకపోవడంతో సామ జంగారెడ్డి కోర్టును ఆశ్రయించారు. వనస్థలిపురం పోలీసులకు సామ జంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలపై కేసు నమోదు చేయాలని కోర్టునుండి ఆదేశాలు రావడంతో వనస్థలిపురం పోలీసులు సామ రంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలపై ఛీటింగ్ కేసుతోపాటు పలు సెక్షన్లకింద కేసు నమోదు చేసారు. ఈ సందర్భంగా సామ జంగారెడ్డి బుధవారం కమలానగర్‌లోని తన నివాసంలో కుమారులుసామ రాజు, సామ మహేశ్వర్‌రెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అవకతవకలకు పాల్పడి తనకు రావాల్సిన వాటా సొమ్మును ఇవ్వకుండా సామ రంగారెడ్డి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, వెంటనే సామ రంగారెడ్డిని అరెస్టు చేసి తనకు న్యాయం చేయాలని సామ జంగారెడ్డి డిమాండ్ చేసారు. అదే విధంగా థియేటర్ ముందున్న ఖాళీ స్థలంలో నిర్మాణాలుచేపట్టి, కిరాయికి ఇచ్చి అందులో సైతం తనకు రావాల్సిన వాటాను ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆయన ఆరోపించారు.

## మ్యాన్‌హోళ్లను పునరుద్ధరించి శాశ్వత పరిష్కారం చూపుతాం : కార్పొరేటర్


కాలనీలో సమస్యను తెలుసుకుంటున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

**హయత్‌నగర్, మే 24 ప్రభాతవార్త:** మ్యాన్‌హోళ్లను పునరుద్ధరించి కాలనీవాసుల దీర్ఘ కాలిక సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అధికారులకు సూచించారు. డివిజన్ పరిధి హయత్‌నగర్ ప్రాంతంలోని వినాయక్‌నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యపై కాలనీవాసుల ఫిర్యాదు మేరకు బుధవారం ఆయన కాలనీలో పర్యటించారు. చిన్న వర్షానికే డ్రైనేజీ పైప్‌లైన్లు నిండిపోయి మురుగునీరు రోడ్లపై పారుతోందని కాలనీవాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఈవిషయమై ఆయన స్పందిస్తూ... గతంలో వేసిన డ్రైనేజీ పైప్‌లైన్ల పరిమాణం, లెవెల్స్ సరిపోక పోవడంతో చిన్నపాటి వర్షానికే మురుగునీరు రోడ్లపై చేరుతోందని అధికారులకు తెలిపారు. వెంటనే లెవెల్స్‌ను సరిచూసుకుని అవసరమైన మేర పైప్ లైన్‌ను మార్చి భవిష్యత్తులో సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన జలమండలి అధికారులను కోరారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు జెట్ట మహేష్, సుధాకర్‌రెడ్డి, కృష్ణగౌడ్, రాము, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కదారి యాదగిరి, పాతూరి శ్రీధర్‌గౌడ్, పారందసాయి పాల్గొన్నారు.

## ఐజీసీఎస్ఈ ఫలితాల్లో టాపర్‌గా నిలిచిన నాచారం డీపీఎస్ కేంబ్రిడ్జ్ విధ్యార్థులు

**నాచారం, మే 24 ప్రభాతవార్త:** కేంబ్రిడ్జ్ పరీక్ష ఫలితాల్లో నాచారం కేంబ్రిడ్జ్ ఇంటర్‌నేషనల్ విద్యార్థులు గ్రేడ్ 10 విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ ఛైర్మన్ మల్కా కొమురయ్య, డైరెక్టర్, సీఓఓ మల్కా జశ్విని, ప్రిన్సిపల్ సునితారావు, వైస్‌ప్రిన్సిపల్ ఎంఎఫ్ శాంతి అంథోనిలు ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. మొత్తం 6 సబ్జెక్టుల్లో ఏ స్టార్ సాధించిన ఈ స్కూల్ టాపర్ ఫెర్‌ఫార్మ్‌గా శ్రీగిరి నిలిచారు. శ్రీరాం శ్రీగిరి 90 శాతం మ్యాథ్స్‌లో 97 శాతం, ఫిజిక్స్‌లో 97 శాతం కెమిస్ట్రీలో 97 శాతం, బయాలజీలో 97శాతం, ఎన్విరాన్మెంటల్‌సైన్స్‌లో 95 శాతం సాధించాడు. హేమంత్ చారీ కనపర్తి ఇంగ్లీస్‌లో 90శాతం సాధించగా, దృతిరెడ్డి మొలుగు కంటైన్డ్ సైన్స్‌లో 90 శాతం, స్పానిష్‌లో 90శాతం సాధించింది. ఐజీఎస్సీ ఎగ్జామ్స్ సిరీస్‌లో నమ్రతా రాయకల్, కెవిన్ విరాల్ షా, ఆకరపు ఓం హన్సల్ కుమారస్వామి ఐసీటీలో 90 శాతం సాధించారు. హేమంత్‌చారీ కనపర్తి గ్లోబల్ పర్స్పెటివ్‌లో 91 శాతం సాదించాడు. చాగంటి శర్వాణీ హిరన్మయ్ హిందీలో 90 శాతం సాధించారు. స్కూల్ విద్యార్థులు 91 శాతం మంది ప్రతిష్టాత్మకమైన కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ ఇన్ ఎడ్యుకేషన్(ఐసీఈ) అవార్డులు, మెరిట్ స్థానాలను అందుకున్నారని స్కూల్ యాజమాన్యం పేర్కొంది.